

# తోడొకరుండిన....

## - శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

అట్లా ఆడుతూ పాడుతూ తొమ్మిదవ తరగతి మంచి మార్కులతో పాసయినారు పూర్ణిమ తరుణి కుసుమ రేణుకలు. లూసీ మాత్రం యధాప్రకారం బొటాబొటీ మార్కులతో పైకి గట్టెక్కింది అనే కన్నా తోయబడింది అంటే సరిగ్గా వుంటుంది.

పదవ తరగతి వాళ్ళ వాళ్ళ భవిష్యత్తు నిర్ణయించే కీలక సంవత్సరం. ఆ క్లాసులోనే స్టూడెంట్స్ ఆప్షనల్ సబ్జెక్ట్ ఎన్నుకోవాలి.

ఆ సంవత్సరం సరైన నిర్ణయం తీసుకోకపోతే వాళ్ళు కోరుకున్న ప్రొఫెషనల్ కోర్స్ చేయటానికి ముందు ముందు అవకాశం వుండదు.

రేణుక తీసుకోవలసిన సబ్జెక్ట్ చిన్న నాటి నుండే నిర్ణయమయి పోయి వుంది. కనక బై పి సి తీసుకుంది.

లూసీకి జనరల్ మాథ్స్ లోనే అంతంత మాత్రం. కనుక మాథ్స్ ఆప్షనల్ గా తీసుకొనే ప్రస్తావనే లేదు. కాబట్టి తను కూడా రేణుక తోటే. మిగతా ముగ్గురు మాథ్స్ ఎన్నుకున్నారు.

ఇంక సీరియస్ చదువులు మొదలయ్యాయి. ఇంత కాలం చదివిన చదువు ఒక ఎత్తు. ఈ మూడు సంవత్సరాలు చదవ బోయేది మరో ఎత్తు. పది పదకొండు పన్నెండు క్లాసుల మార్కులన్ని వాళ్ళ రేంక్ లో కలుపుతారు. ఆ మార్కులబట్టే కాలేజీలలో సీట్ దొరికే అవకాశం వుంటుంది. అందుకే అందరూ సీరియస్గా చదువులు మొదలెట్టారు. చదువుల మీద కాన్సన్ట్రేట్ చేస్తూనే లైబ్రరీలో మంచి పుస్తకాలు చదవటం మాత్రం ఆపలేదు.

లూసీకి చదువు మీదకన్నా పాటలు పాడటం మీద మక్కువ జాస్తి. పాటల ప్రాక్టీసు కోసం ఎంత సమయమైనా వెచ్చిస్తూ వుంటుంది. ఎక్కడ పోటీలు వున్నాయంటే అక్కడకు వెళ్ళి ప్రైజులు తెచ్చుకుంటూ వుంటుంది.

"ఈ చదువులన్ని మా అమ్మ నాయ్న కొరకే. నేనెప్పటికైనా సినిమాలలో పాటలు పాడటానికి పోత." అంటూ వుండేది.

కాకపోతే తల్లి తండ్రులు స్కూల్ టీచర్లు కావటాన కొంత వాళ్ళ భయానికి కూడా ఎట్లాగైనా పరీక్షలు గట్టెక్కాలన్న మాట కూడా మనసులో వుంది.

లూసీ తల్లి తండ్రులు చాల స్ట్రిక్ట్. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా చర్చికి వెళ్ళుతారు. వారితో పాటే లూసీ కూడా వెళ్ళుతూ వుంటుంది. అక్కడ ప్రార్ధన గీతాలు పాడటంలో ముందు వుండేది. కాక పోతే తాను చాల బాగా పాడుతానన్న ఒక గర్వం మాత్రం నెత్తి మీదెక్కి స్వారీ చేస్తూ వుండేది.

ఇన్ని వున్నా అమ్మ అంటే భయం. ఇంత వయసు వచ్చినా కూతురు తప్పు చేసినా ఏ సబ్జెక్ట్ లోనైనా ఫెయిల్ అయినా బెత్తం తీసుకొని చితగ్గొట్టేది. ఆ దెబ్బల భయానికైనా పరీక్షల సమయం లో ఏదో విధంగా బట్టీ కొట్టి పాసవుతూ వచ్చింది.

తక్కిన క్లాస్ మేట్స్ లాగా వీళ్ళు నలుగురు పోచికోలు కబుర్లతో సమయం వృధా చేయరు. సమయం దొరికినప్పుడల్లా ఏదో ఒక సబ్జెక్ట్ గురించే మాట్లాడుతూ వుండే వాళ్ళను అంటి పెట్టుకొని తిరుగుతూ వారికి బాగా చేరువ అయింది. నలుగురు ఫ్రెండ్స్ ను తోకలాగా అంటి పెట్టుకొనేది.

పరీక్షల ముందర అందరూ కంబైన్డ్ స్టడీస్ చేయటానికి నిశ్చయించుకున్నారు. ఆ కారణంగా అయిదుగురు తరుణి ఇంట చేరేవారు.

కుటుంబం పెద్దదవటాన పూర్ణిమ ఇంట పిల్లల రణగొణధ్వనులతో అంతగా చదువుకోటానికి వీలుగా వుండేది కాదు.

శ్రీహరికి చదువన్నా చదువుకొనే పిల్లలన్నా అత్యంత అభిమానం. ఆడపిల్లలకు అంత చదువులెందుకు అనే రోజులు అవి. కాని ఆయన అత్యంత శ్రద్ధగా కూతురికే కాదు ఆమె స్నేహితురాళ్ళ చదువుల విషయంలో కూడా సహకరించేవారు. ఆయన సలహా మేరకే వారి ఇంట అన్ని వసతులు ఏర్పరిచి అయిదుగురు కలిసి చదువుకొనే ఏర్పాట్లు చేసారు.

ఆ మధ్య తరుణి తల్లికి అనారోగ్యానికి గురి అవటాన వంటకు ఒకామెను కుదుర్చుకున్నారు. ఇల్లు విశాలంగా వుంటుంది. మేడ మీద తరుణి కోసం వున్న ప్రత్యేకమైన గదిలో ఇంకో రెండు మంచాలు వేయించాడు శ్రీహరి.

టైం ప్రకారం కాఫీలు టిఫిన్లు భోజనాలు ఏర్పాటు చేయటానికి వంటామెకు ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చాడు.

అన్ని వసతులు వున్న అక్కడ వారి చదువుకు ఎటువంటి అంతరాయం లేకుండా జరిగి పోతోంది.

లూసి వారి తోటే చేరింది. ఎక్కడ ఏ వాతావరణం వుంటే అక్కడ ఇమిడిపోయె మనస్తత్వం. అంతటా చదువుల వాతావరణం అయ్యేటప్పటికి ఆమె కూడా శ్రద్ధగా చదవటం మొదలెట్టింది.

ఇంట్లో పని అయిపోగానే సునంద వచ్చి వారికి ఏవైనా సందేహాలుంటే తీరుస్తూ అక్కడే ఏదో పుస్తకం చదువుతూ కూర్చునేది. మధ్యమధ్యలో వాళ్ళు రిలాక్స్ అవుతున్న సమయంలో ఏవేవో కబుర్లు జోక్స్ చెప్పుతూ వుంటే వాళ్ళకు రిలాక్సింగ్ గా వుండేది.

సాయంత్రం కాస్సేపు షటిల్ బాడ్మింటన్ ఆడుతూ రిలాక్స్ అయే వారు.

మంచి ఎండాకాలం. అప్పటికి ఇంకా ఎసి లు కూలర్లు ఇళ్ళల్లో వాడకం లోకి రాలేదు. సాయంత్రమే డాబా మీద బాగా నీళ్ళు చల్లి అందరూ పరుపులేసుకొని పడుకొనే వారు.

వాళ్ళ ఇళ్ళు టాంక్ బండ్ కింద వున్న కాలనీలో వున్నాయి. శ్రీహరి డాబా బాగా పెద్దగా విశాలంగా వుంటుంది. పెద్ద వారు ఒక పక్కగా పరుపులు వేసుకొనేవారు. వారికి కొంచం ఎడంగా అమ్మాయిలు అయిదుగురు పడుకొనే వారు. రాత్రి పదకొండింటివరకు మేలుకొని కబుర్లు చెప్పుకుంటూ పడుకునేవారు. టాంక్ బండ్ మీద అడ్వర్టైజ్మెంట్ బోర్డ్ల మీద రంగురంగుల లైట్లు వెలుగుతూ ఆరుతూ వుండేవి.

అందరూ కళా పోషకులే. వెల్లికిలా పడుకొని ఆకాశంలో మబ్బులు చూస్తుంటే అవి అనేకనేక రూపాలలో కనిపిస్తుంటే చూడటం సరదా. అదిగదిగో అక్కడ ఆ మబ్బుచూడండే అచ్చం సింహం నోరు తెరుచుకున్నట్టు కనిపిస్తున్నది. అని ఒకరంటే ఈ మబ్బుచూడండే పెద్ద చెట్టులాగ కనిపిస్తున్నది అని మరొకరు.

"నాన్నా మా చిన్నప్పుడు ఇట్లాగే పడుకున్నప్పుడు సినిమా థియేటర్ నుండి సినిమా పాట వినిపించేది కదూ!"

"అదేంటే ఇంత దూరానికి సినిమా థియేటర్ నుండి పాట వినిపించటం ఏమిటే."

"నిజమేనమ్మా. ఇటు పక్క టాంక్ బండ్ లైట్లు, అటుపక్క నుండి సినిమా పాటలు. అది బీస్ సాల్ బాద్ అనే హిందీ సినిమా. మీరందరూ ఆ పాట వినే వుంటారు. ఏమ్మా లూసీ నువ్వు పాటలు బాగా పాడుతావు కదా! ఈ పాట తెలియదా?"

"అవును అంకుల్ కహి దీప్ చలే కహి దిల్ కదా!"

"అవునమ్మా అదే పాట. ఆ సినిమా ఇక్కడ ట్విన్ థియేటర్స్ వున్నాయి కదా. లిబర్టి ఎంబెసి అని, వాటిలో లిబర్టిలో రిలీస్ అయింది. ఆ రోజులలో కూడా ఎండాకాలం ఇట్లాగే డాబా మీద పడుకొనే వాళ్ళం. సెకండ్ షో సమయంలో వేడి భరించ లేక థియేటర్ లో తలుపులన్ని తెరిచి వుంచే వారు. పొల్యూషన్ ఫ్రీ. ఆ పాటికి వూరంతా మాటు మణిగి పోయి వుండేది.

ఆ సమయంలో ఆ ప్రశాంత వాతావరణంలో అలలు అలలుగా గాలితో తేలి యాడుతూ ఆపాట వినిపిస్తూంటే అందరమూ అట్లా

వింటూనే వుండిపోయె వాళ్ళం. నిజంగా లతా మంగేష్కర్ గొంతులో ఆ పాట అద్భుతంగా వుండేది. అసలు ఆమె ప్రతి పాట ఒక ఆణిముత్యమే.

ఆమె తెలుగులో కూడా పాడిన పాతపాట నిదురపోరా తమ్ముడా అని వుంది. ఎప్పుడైనా విన్నావా? ఆ పాటలో ఆవిడ పాడిన హై పిచ్ ఎవరు కూడా పాడలేకపోయేవారు. అంత హైపిచ్ లో పాడినా లోపిచ్ లో పాడినా ఆవిడ గొంతులో ఏ విధమైన మార్పు వుండేది కాదు. అంత అవలీలగా పాడేసేది.

లూసీ నువ్వు తప్పకుండా అటువంటి పాటలు నేర్చుకొని పోటీలలో పాడాలమ్మా."

"అంకుల్ నేను కూడా ఆ పాట విన్నాను. కాని కరెక్ట్ లిరిక్ ట్యూన్ తెలియదు అందుకనే నేర్చుకో లేక పోయాను."

"అయ్యో! మన ఇంట్లో ఆ పాట గ్రామఫోన్ రికార్డ్ వుంది. అవును సుగుణ మన ఇంట్లో ఆ సినిమా పాటల పుస్తకం వుందనుకుంటాను. రేపు చూసి లూసీకి ఇవ్వు." అని భార్యకు చెప్పి, "సినిమా హాళ్ళల్లో పాటల పుస్తకాలు పది నయాపైసలకు అమ్మేవారు. నేను చూసిన నాకు నచ్చిన ప్రతి సినిమా పాటల పుస్తకాలు కొనుక్కొని దాచే వాడిని."

"అంకుల్ నిజంగా సర్ప్రైజింగ్. మీకు పాటల మీద ఇంత ఇంటరెస్ట్ వుందని తెలియనే తెలియదే?"

"లూసీ, మీ అంకుల్‌కు పుస్తకాలు, పాటలరికార్డులు, పూలమొక్కలు వుంటే చాలు. ఇంక అన్నం నీరు కూడా అక్కరలేదు."

"సుగుణ ఇంకొక విషయం మర్చి పోయావు. పిల్లలతో కబుర్లు కూడా." అంటూ నవ్వుతూ అన్నాడు. "నా దగ్గర పుస్తకాల కలెక్షన్ తో పాటు గ్రామఫోన్ రికార్డ్స్ కలెక్షన్ కూడా వుంది. నీకు హిందీలో తెలుగులో ఏదైనా మంచి పాట కావాలంటే నన్ను అడుగు. విని ప్రాక్టీస్ చేద్దువుకాని."

అట్లా క్లాసు పుస్తకాలతో పాటు జీవితాలను కూడా చదువుతూ పాటలు పాడేవారు పాడుకుంటూ సాహిత్య పోషణ చేసేవారు చేస్తూ పదవ తరగతి పాసయినారు.

లూసీ తప్ప తక్కిన ముగ్గురూ ఫస్ట్ క్లాస్ లో పాసయినారు. లూసీ మామూలుగా పాసయింది.

రేణుక తండ్రి కోరిక, తన జీవితాశయం, కష్టపడి చదివిన ఫలితంగా చాల మంచి మార్కులతో పాసైనందున మెడికల్ కాలేజీలో మొదటి లిస్ట్ లోనే సీటు సంపాదించింది.

తక్కిన నలుగురు కోఠీ వుమెన్స్ కాలేజీలో చేరారు.

పూర్ణిమకు చిరకాలంగా వున్న సాహిత్యాభిలాషే ఇంగ్లీష్ లిటరేచర్ తో బిఏ లో చేరేలాగ ప్రోత్సాహించింది. కుసుమ మాథ్స్ మైన్ గా బిఎస్సి లో, తరుణి లూసీ ఎకనామిక్స్ తో బిఏ లో చేరారు. ఇన్నాళ్ళూ తెలుగుతో యుద్ధం చేసి అలసి పోయిన లూసీ ఫ్రెంచ్ తీసుకుంది.

★★★★★★★

మొదటి సారి గేటు దాటి కాలేజీ ఆవరణలోకి కాలు పెట్టినప్పుడు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

"మై గాడ్. ఇదేందివే? పెద్ద కాంపౌండ్ లోపల ఏముందొ ఎన్నడు తెల్వదు. ఏమ్ బిల్డింగ్వే." ఆపుకోలేని లూసీ నోరు తెరిచింది.

"అప్పుడే నోరు తెరిస్తే ఎట్లా? ఆ మెట్లు ఎక్కి లోపలికి వెళ్ళితే ఇంక నీ నోరు ఆశ్చర్యంతో మూతే పడదేమో?"

అంతకు ముందర వూరి నుండి బంధువులు వస్తే వాళ్ళకు వూళ్ళోని విశేషాలు చూపిస్తూ పూర్ణిమ తరుణి అప్పటికే ఆ కాలేజీ చూసి వున్నారు.

"ఎంట్రెన్సే ఇంత అందంగా వుంది కదా! లోపల ఇంకా ఎంత బాగుంటుందో!" కుసుమ కూడా అదే మొదటిసారేమో రావటం.

"ఆ సింహాలు చూడు. మెట్లకు రెండుపక్కలా నిలబడి ఈ క్రూర ప్రపంచం నుండి మీకు రక్షణ కలిగిస్తాము అని అమ్మాయిలకు భరోసా యిస్తున్నట్టు వున్నాయికదా!"

"ఆహాఁ మొదలెట్టావా, నీ కవిత్వం. ఇంకా నీ లిటరేచర్ క్లాసులు మొదలు కూడా పెట్టలేదు అప్పుడే కాలేజీ ప్రభావం నీ మీద పడ్డట్టు వుంది." పూర్ణిమను మోచేత్తో పొడిచింది కుసుమ. "అయినా నగరం నడిబొడ్డున వుమెన్స్ కాలేజీ కోసం ఇంత అందమైన బిల్డింగ్ కట్టించాలన్న అయిడియా ఎవరికి వచ్చిందో కదా!"

"ఈ బిల్డింగ్ కాలేజీ కోసం కట్టించింది కాదు. ఒకప్పుడు బ్రిటిష్ లెఫ్టినెంట్ కల్నల్ కిర్క్ పాట్రిక్ ఇండియాలో అధికారిగా వున్న రోజులలో తన ఇండియన్ భార్య ఖైరున్నిసా కోసం కట్టించాడట. లోపల గార్డెన్లో ఈ బిల్డింగ్ నమూన చిన్నది కూడా వుంది. ఇక్కడికి టూరిస్టుల్గా వచ్చిన వారు ఆ నమూనా వద్ద నిల్చొని ఫొటోలు కూడా తీసుకుంటారు. కుసుమ ఇంకొక విషయం తెలుసా? ఈ బిల్డింగ్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు వాళ్ళ ఎంబసీలాగా వుపయోగించేవారట.

నువ్వు బయట చూసే ఇంత అబ్బురపడిపోతున్నావు, లోపల దర్బార్ హాల్ చూస్తే కళ్ళు చెదిరిపోతాయి. పదండి లోపలికి వెళ్ళి అంతా ఒకసారి చుట్టబెట్టి వద్దాము."

ఎడ్మిషన్ టైంలో ఎన్నిసార్లూ వచ్చినా సీనియర్స్‌ను చూసి భయంభయంగా వెనక గేటు గుండా వచ్చి డైరెక్ట్‌గా ఆఫీసుకెళ్ళి పని చూసుకొని వెళ్ళిపోయారు.

ఇప్పుడు మాకు కూడా ఈ కాలేజీలో సర్వాధికారాలు వున్నయన్నంత ధీమాతో తిరగసాగారు.

దర్బార్ హాలులో వున్న షాండిలియర్స్, పైన చుట్టూ బాల్కనీ, నాలుగు మూలలా వున్న పెద్దపెద్ద అద్దాలు, వీటన్నిటికి తోడు సీతాకోక చిలుకల లాంటి అమ్మాయిలు. ఒకటేమిటి అన్ని కనులకు విందులా వున్నాయి.

"మనమందరమూ వేరేవేరే క్లాసులలో వుంటాము. అందరం కలుసుకోవటానికి వీలు పడదేమో." అప్పుడే అందరూ విడిపోయినంత దిగులుగా అంది కుసుమ.

"ఓసి పిచ్చి మొద్దా, ఇది కాలేజీనే. మన స్కూల్ లాగా పొద్దుటి నుండి సాయంత్రం వరకు క్లాసులు వుంటాయా ఏంటి? ఏ క్లాసయినా బోర్ అనిపిస్తే చక్కగా ఎగ్గొట్టొచ్చు తెలుసా? ఇంకా ఫ్రీ పీరియడ్స్ కూడా వుంటాయట." పూర్ణిమ ధైర్యం చెప్పింది. "అట్లా అని మనం చదువులు నెగ్లెక్ట్ చేయకూడదు."

"మనలో ఎవరికైనా ఫ్రీ వున్నప్పుడు ఇక్కడే లైబ్రరిలో తక్కిన వారి కోసం వెయిట్ చేద్దాము. అందరమూ కలిసిన తరువాత నేనొక చోటు చూపిస్తాను అక్కడికెళ్ళి కూర్చోవచ్చు. అంతే కాక లంచ్ కూడా అందరమూ కలిసే చేద్దాం. స్కూల్లో వున్నట్టే వుందాము. అంతేకాని మనం ఒకరికి ఒకరం దూరం ఎప్పటికి కాము." తరుణి మాటలకు అందరు సరేనంటే సరే అన్నారు.

"ఇంతకూ మనం పెట్టబోయే అడ్డా ఎక్కడో!"

"లవర్స్ రాక్"

"వ్వాట్, నీకేమైనా పిచ్చా ఇది వుమెన్స్ కాలేజీ. ఇక్కడ లవర్స్ రాక్ ఏమిటే? నీకేమైనా మతిపోయిందా?" కుసుమే మళ్ళీ అడిగింది.

"లవర్స్ రాక్ అన్నాను కాని అక్కడ లవర్స్ కూర్చుంటారని అన్నానా? అది కూడా నిజాం పీరియడ్‌దే. ఆ రోజుల్లో పెట్టిన పేరో మరి ఈ మధ్య ఏమైనా వచ్చిందో తెలియదు. కాని అక్కడ పెద్దపెద్ద గుట్టల వంటి రాళ్ళు వున్నాయి. అది బయటకు కనిపించదు. క్లాసులు ఎగ్గొట్టే వాళ్ళు, ఎవరికి కనపడకుండా వంటరిగా కూర్చొనే వాళ్ళకు అనువైన ప్రదేశం." తరుణి పూర్ణిమ వంతుల వరిగా కాలేజీ గురించి వివరిస్తూ వున్నారు.

“అదిగో అదే లవర్స్ రాక్. చూడండి అక్కడ ఆల్రెడి కొందరు కూర్చొని వున్నారు. మనం కూడా ఇక్కడ మన ప్లేస్ రిసెర్వ్ చేసుకోవాలి. ఇంక మన లంచ్ స్పాట్ ఇదే. ఎవరుముందుగా వస్తే వాళ్ళు ప్లేస్ పట్టుకోవాలి."

ఫ్రెషర్స్ రాగింగ్ మొదలయింది. ఇంకా సీరియస్‌గా క్లాసులు మొదలు కాలేదు. కాలేజీ అంతా కోలాహలంగా వుంది. సీనియర్స్‌కు కూడా క్లాసులకు వెళ్ళే మూడ్ లేదు.

"అబ్బ ఏంటే ఈ గోల? క్లాసులు లేవు పాడు లేదు. ఈ సీనియర్స్ చేసే వెధవ అల్లరి తోటి మతి పోతోంది." కుసుమ గోల మొదలెట్టింది.

"అన్నిటికీ నీకు తొందరేనే కుసుమా. ఇదంతా కొత్త అమ్మాయిలకు భయం బెరుకు తగ్గించటానికి, ఫ్రెండ్‌షిప్ డెవలప్ చేసుకోవటానికి ఇదొక మార్గం. అంతే. ఫ్రెషర్స్ పార్టీ అని చేస్తారు అది అయిపోయిందంటే ఎవరిదారి వారిది. ఎవరి చదువులు వాళ్ళవి. ఇంకొక్క నెల రోజులు ఓపిక పట్టాలి. మనం ఇరిటేట్ అయే కొద్దీ వాళ్ళకు హుషు వచ్చి ఇంకా ఎక్కువ చేస్తారు. మెదలకుండా వుంటే సరి." పూర్ణిమ సర్ది చెప్పింది.

కుసుమ కాలేజిలొ చేరగానే తన కోరిక చిన్నాన్నా తాతయ్యల వద్ద తిరిగి ప్రస్తావించింది.

"తాతయ్యా, నాకు మైనారిటీ వచ్చేదాకా ఆగమన్నారు. నా పేరు మీదవున్న ఆస్తితో ఏదైనా అభివృద్ధి కార్యక్రమం చేబడుదాం."

"కుసుమా, నీకు ఇంకా వివాహం కావలసి వుంది కదమ్మా. డబ్బంతా ఇట్లా దేనికైనా రాసేస్తే ఇబ్బంది కదా."

"తాతయ్య, నేను ఇప్పుడే చెప్తున్నాను. కట్నం ఇచ్చి పెళ్ళి చేసుకోవటం నా ఆశయానికి విరుద్ధం. నన్ను నన్నుగా కోరుకొని పెళ్ళి చేసుకోవాలి. అంతే కాని కట్నం కోసం చేసుకొనేవాడు నాకు వద్దు." మొండిగా చెప్పింది.

"సరేనమ్మా నీ ఇష్టమే కానీయి. ఏం చేద్దామని వుందో అది కూడా సూచన ప్రాయంగా అనుకుంటే బాగుంటుందేమో! నీకేం చెయాలనిపిస్తున్నదో ముందర చెప్పితే ఆతర్వాత ఎట్లా చేయాలన్న విషయం ప్లాన్ చేద్దాం."

"నాకైతే ఆడపిల్లల చదువుల కోసం ఈ ధనం వినియోగించాలని కోరికగా వుంది. కొన్ని సార్లు ప్రేమాలయానికి వెళ్ళొచ్చాను కదా, అక్కడ అమ్మాయిలు పై చదువులకు వెళ్ళే అవకాశం లేక స్కూల్ తోటే ఆపేస్తున్నారు. వాళ్ళకోసం ఏమైనా చేద్దామని వుంది"

"కానీయ్ అట్లాగే కానిద్దాం."

"శ్రీహరి అంకుల్ ఇటువంటి సోషల్ సర్వీస్ కార్యక్రమాలు ఎన్నో చేస్తూంటారు. కావాలంటే ఆయన సలహా తీసుకొని చేయండి."

ఆమె మాటల మీదనే ఒకనాడు తాతగారు మాధవ్, శ్రీహరి వద్దకు వచ్చి కూలంకషగా చర్చించారు.

"ఇంకా మనలో ఈ కట్నాల సమస్య తగ్గలేదు. అంతా ఈ విధంగా ఖర్చు పెట్టేస్తే కుసుమ వివాహ సమయంలో ఇబ్బంది అవుతుందేమో!"అనుమానం వ్యక్త పరిచారు.

"మీరు చెప్పింది కూడా ఆలోచించవలసిందే. ఆ విషయం నేను కుసుమకు చెప్పాల్సిన రీతిలో చెప్పుతాను. మీరేమీ వర్రీ అవవద్దు." కుసుమకు తన మాటమీద వున్ననమ్మకం దృష్ట్యా వారికి భరోసా ఇచ్చాడు.

ఆ విషయమే కుసుమను ప్రత్యేకింగా పిలిపించి చర్చించాడు ఆయన.

"సరే అమ్మా కుసుమా నిన్ను ఇక్కడికి పిలిపించిన కారణం వేరే. మొన్న మీ తాతయ్యతో మాట్లాడాను. ఆయన చెప్పిందంతా వింటే ఈ విషయంలో నీ నిర్ణయం సరైనదే అనిపిస్తున్నది. ప్రేమాలయంలో అమ్మాయిల చదువు స్కూల్తోనే ఆపకుండా వారికి ఇంకా వొకేషనల్ కోర్సెస్ చేయటానికి ఏర్పాటు చేద్దాం. రేపు నేను మీ మాధవ్ బాబాయి టెక్నికల్ డిపార్ట్‌మెంట్ కెళ్ళి దానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాము. నీకు

సమ్మతమేగా?"

"థ్యాంక్యూ అంకుల్. నేను కోరుకున్నది కూడా అదే. మీకు ఈ విషయాలలో అనుభవం బాగా వుందని తెలుసు అందుకే తాతయ్య చిన్నాన్నను మీతో సంప్రదించమన్నాను."

"అట్లాగే చేద్దాం కుసుమా! కాకపోతే ప్రస్తుతానికి నీ పేరున వున్న ధనంలో కొంత భాగం మాత్రమే వినియోగిద్దాం. ఎప్పుడైనా మొత్తం ఒక్కసారే పెట్టకూడదు. అంచలంచెలగా అభివృద్ధి చూసుకుంటూ పెట్టాలి. ఒక్కసారి మొత్తమంతా పెట్టేసి ఎవరూ సరైనా రెస్పాన్స్ చూపకపోతే మన ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరే అనుతుంది. అందుకనే ఈ విషయం మాకు వదిలేసేయి. నీ చదువు అయిపోయిం తర్వాత అంతా భాధ్యత నీకే ఒప్పచెప్పుతాము."

ఆయన మాటలకు తృప్తి చెందిన కుసుమ, "అట్లాగే అంకుల్, మీరెట్లా చెప్పితే అట్లాగే చేద్దాం."

"ఏమర్రా,  కబుర్లు వింటూ కూర్చోవటమేనా, కాసిని కాఫీ నీళ్ళు మా మొహాల్న పోసేదేమన్నా వుందా?" కోడళ్ళను వుద్దేశించి అన్నది జానకమ్మ.

"అవునే సునందా.. నీ సంగీత సాధన ఎంత వరకు వచ్చింది? ఒక పాటఏమైనా పాడుతావా?" కాఫీలు తాగుతూ సుగుణ అడిగింది. చిన్నప్పటి వినికిడి సంగీతమే సునంద బాగా పాడుతూంటుంది. అది చూసిన అత్తగారు వూరికే వచ్చిన విద్యను పోగొట్టుకోవటం దేనికని మ్యూజిక్ క్లాస్లకు పంపసాగింది.

"సరే, మీరంతా మీమీ కుర్చీలను గట్టిగా పట్టేసుకొని కూర్చోండి. మళ్ళీ ఎవరైనా పారిపోవటానికి ప్రయత్నిస్తే చూసుకోండి."

"చాల్లేవే, నీ వేళాకోళాలు. రోజూ "ఎన్నగాను రామభజన" అని కూని రాగం తీస్తుంటావే ఆ కీర్తన పాడు."

సునంద చిలిపితనానికి ఆ అవకాశం కూడా వదల లేదు. ఏదో ఒక అల్లరి చేయందే ఆమెకు రోజు పూర్తయినట్టు అనిపించదు.

రామచిలుకనొకతి పెంచి ప్రేమ మాటలాడనేర్పి దాకా పాడి "రామరామరామయనుచు, రామరామరామాయనుచు" అంటూ రకరకాల సంగతులు వేస్తూ పాడుతూనే వుంది. ఆ చరణం నుండి ఇంక ముందుకు సాగటం లేదు. రకరకాల సంగతులు వేస్తూ మధురంగా పాడుతూనే వుంది.

"ఎంతసేపే ఆ రామరామయనుచు, ఇంక ముందుకు పోవేమే." అత్తగారి మాటకు తరువాయి పాట "రమణియొక్కతే" అంటూ అందుకుంది.

ఆమె చిలిపితనానికి అందరూ నవ్వుకున్నారు.

"సుందరం దీనికి పిల్లలకన్నా అల్లరి ఎక్కువవుతున్నదిరా, ఒకసారి దాని చెవి మెలిపెట్టు."

"ఆ పనేదో నువ్వే చేసెయ్యమ్మా."

"ఇప్పుడైనా కాస్త అల్లరి తగ్గించి బుద్దిగా వుంటే నీ బొజ్జలో వున్న వాళ్ళు కూడా కాస్త ఒబ్బిడిగా వుంటారు. లేకపోతే నీ అల్లరికి  ఆ వచ్చేవాడో వచ్చేదో తోడైతే ఇంక ఇల్లుపీకి పందిరే." కడుపుతో వున్న కోడలి వంక మురిపెంగ చూస్తూ అన్న జానకమ్మ మాటలకు అందరూ తన వైపే చూడటంతో సిగ్గుపడింది సునంద.

ఫస్టియర్ బిఏ ఇంగ్లీష్ లిటరేచర్లో నలుగురు అమ్మాయిల గ్రూప్ ఒకటి వుంది. షర్మిల, నిమ్మి,  జూహి, రాగిణి. వారు నలుగురు కూడా చాల గొప్పింటి అమ్మాయిలని తెలుస్తూనే వుంది. కార్లలో వస్తారు. వాళ్ళు కాలేజీకి వస్తున్నట్టు కనబడదు. ప్రతిరోజూ పిక్నిక్కు వస్తున్నట్టే వుంటారు. డ్రెస్, హెయిర్స్టైల్ అందరికన్నా భిన్నంగా వుంటారు.

వారి నలుగురి మాటలలో  బాయ్‌ఫ్రెండ్స్ అన్న పదం తరుచుగా వినిపిస్తూ వుండేది. ఇంకా మన దేశం అమ్మాయిలు అంత ఓపెన్‌గా మాట్లాడుకొనే విషయం కాదు. అప్పటికే కొందరికి బాయ్‌ఫ్రెండ్స్ వున్నా కూడా పెద్దగా ఆ విషయం నలుగురిలో డిస్కస్ చేసేటంత మాడర్న్ కాలేదు.

ఫ్రెంచ్ సెకండ్ లాంగ్వేజి క్లాస్లో లూసీ వారితో పరిచయం పెంచుకోవటమే కాక వాళ్ళ వైపు ఎట్రాక్ట్ అవుతున్నట్టు కనిపించింది. మెల్లిగా కట్టుబొట్టు వారిని అనుకరించటం మొదలెట్టింది.

అది గమనించిన కుసుమ వూరుకోలేక ఒకసారి  "లూసీ మనం చదువు కోసం వచ్చాము. మన చదువేదో మనం చూసుకోవాలి కాని వాళ్ళ వెనక వీళ్ళ వెనక తిరగాల్సిన అవసరం ఏమిటి నీకు?" లూసీని హెచ్చరించింది.

"లేద్వే. గా నిమ్మి వాల్ల నాయ్న దోస్త్ సినిమా డైరెక్టరంట. నాకు సినిమాల పాడే దాన్కి చాన్సిప్పిస్తదేమోనని అడుక్కుంటున్నాను. గంతనే."

"అయినా అడుక్కోవలసిన అగత్యం నీకేమిటే? నీలో టాలెంట్ వుంది. గుర్తింపు అదే వస్తుంది. ఏం సినిమాలో కాకపోతే నీ టాలెంట్ ఎవరికి తెలియదనా? ముందర చదువు మీద దృష్టి పెట్టు డిగ్రీ అయే లోపల నీకు ఎక్కడో ఒక చోట చాన్స్ వచ్చి తీరుతుంది. ఈ లోగా ఆలిండియా రేడియోకి అప్లై చేయి. అక్కడ కూడా లలిత సంగీతం పాడటానికి అవకాశం దొరక వచ్చు. అంతే కాని ఎవరో సహాయం చేస్తారని వాళ్ళ వెనకబడి తిరగనక్కరలేదు." అంటూ గట్టిగానే మందలించింది.

లూసీ స్నేహితుల మాటలు ఈ చెవి నుండి విని ఆ చెవితో వదిలేసింది.

కట్టూబొట్టూ డ్రెస్ స్టైల్ కూడా మారిపోయాయి.

మాటలలో కూడా కొత్తకొత్త పదాలు దొర్లుతున్నాయి. "కమాన్ యార్, ఓ డోన్ట్ బి సిల్లి." అని సందర్భం లేకుండా కూడా వాడేస్తోంది.

నుదురంతా కప్పేస్తూ ముందు వైపున జుట్టు కత్తిరించుకున్నది. గట్టిగా కట్టిన పోనీ టైల్. వంటిని పట్టేసినట్టుగా బిగుతైన కుర్తా. పైజామా అయితే అసలు పైకి ఎట్లా లాగిందో అని ఆశ్చర్య పోయేటంత టైట్ గా వుంటున్నాయి. మెడను చుట్టేస్తూ ఒక గుడ్డపీలిక.

ఈ అవతారం ఏమిటే అన్న ఫ్రెండ్స్ తో ఒకరకంగా తలఎగరేస్తూ, "కమాన్ యార్ ఇది లేటెస్ట్ ఫాషన్. సాధనా కటింగ్ హెయిర్ స్టైల్ ఇప్పుడు ఫాషన్ ఎర్కనా. ఇంకా కొన్ని దినాలు అయితే ఇది భీ ఔటాఫ్ డేట్ అయ్తది. ఇది కాలేజ్ భయ్. మన స్కూల్ లెక్క కాదు. బి ఎ రోమన్ ఇన్ రోం. అంటరు తెల్వదా. ఇంక స్కూలెక్కుంటె అందరు నవ్వుతరు." అంటూ ఎదురు వాళ్ళకే లెక్చరిచ్చి, "మీరు కూడ ఈ చీరలు జడలేసేడిది బంద్ చేయుండ్రి. నాకు తెల్సిన మంచి బ్యూటి పార్లర్కు తోల్కపోత." అంటూ సలహా కూడా ఇచ్చింది.

ఆమెను జాలిగా చూడటం తప్ప ఇంకేమి చేయలేక పోయినారు ఆ మిత్రత్రయం. కలిసి నప్పుడు రేణుకకు కూడాచెప్పి బాధపడ్డారు.

సునందకు ఏడవ నెల నిండబోతున్నది. ఈ లోగా సీమంతం చేద్దామని అత్తగారు వుబలాట పడుతోంది. పెళ్ళయిన ఇన్ని సంవత్సరాలకు కోడలికి కడుపు పండబోతున్నదన్న ఆనందం ఆమెను నిలవనీకుండా చేస్తున్నది.

మాటల మధ్యలో, "సాధారణంగా అత్తింట్లో సీమంతం చేసి పుట్టింటి వాళ్ళు పురిటికి తీసుకెళ్ళటం ఆనవాయితీ. కాని మా సునందకు అత్తిల్లయినా పుట్టిలయినా ఇదే. కాబట్టి ఆ వేడుకేదో మేమే చేస్తాం." అంటూ ఒకటికి నాలుగుసార్లు అనటం అందరూ విన్నారు.

సునంద ఎందుకనో వున్నట్టుండి మూడీగా అయిపోతూ వుంటుంది. ఏ విషయం గురించో కాని ఏదో దిగులు పడుతున్నట్టు కనిపిస్తూ వుంటుంది. అత్తగారు తోడి కోడళ్ళు ఆ విషయం గమనించారు. కాని కాన్పు దగ్గరవుతున్న కొద్దీ గర్భిణీ స్త్రీలలో ఆ విధమైన మానసిక మార్పులు రావటం సహజమే అని పెద్దగా పట్టించుకోలేదు.

మాటల మధ్యలో సునంద ఆ విధంగా మారటం గమనించిన కుసుమ, తరుణి గదిలో కబుర్లు చెప్పుకుంటుండగా ఆ ప్రస్తావన తెచ్చింది.

"పూర్ణిమా, ఎందుకే సునంద పిన్ని అప్పుడప్పుడూ దిగులుగా కనిపిస్తుంది?"

"ఏమో కుసుమా, ఇటువంటి విషయాలు ఇంట్లో అడుగుతే నాయనమ్మ చంపేస్తుంది. మొన్న ఆ మధ్య అమ్మ పెద్దపిన్ని కూడా అనుకుంటుంటే విన్నాను. కాని ఈ సమయంలో అట్లాగే వుంటారుట."

"నీకేమైనా పిచ్చా? డెలివరీ ముందర అంత టెన్షన్ వుండగూడదు. మనసంతా ప్రశాంతంగా వుండాలని అంటారు కదా! ఏదైనా ప్రాబ్లం వుందేమో?"

"పిచ్చిపిచ్చి అనుమానాలు పెట్టుకోవద్దు కుసుమా. అవన్నీ చూసుకోవటానికి అమ్మ నాయనమ్మ వాళ్ళు వున్నారు."

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments